భం
# గురువాణి
12 ఫిబ్రవరి , 2026 సంచిక-252



## సమాజం తీరు

సమాజం మొదటి నుంచి అంతే, సమాజం మంచిని ఒప్పుకోదు. సమాజంలో మనల్ని నీచుడనవచ్చు, చోరుడు అనవచ్చు, క్రూరుడనవచ్చు, మూర్ఖుడనవచ్చు, సమాజం యొక్క తీరు ఈ రీతిగా ఉంది, అందుకే మా స్వామి గారు అనేవారు సత్యం చెప్పులు తొడుక్కునే లోపు అసత్యం ఊరంతా చుట్టేసి వస్తుంది అని అనేవారు. అంటే అసత్యానికి ప్రచారం ఎక్కువ అని అర్థం. భగవంతుడైన శ్రీరామచంద్రుని సీతమ్మ తల్లిని ఊరికే విడిచిపెట్టిందా ఈ సమాజం? ఎన్ని నిందలు వేసినారు వారి పైన, శ్రీకృష్ణ భగవానున్ని దొంగ అని నిందించింది, శమంతకమణిని దొంగతనం చేశాడు అని నిందించింది ఈ సమాజం. ఏం పాపం చేశాడు జీసస్ క్రైస్తు, చిత్రహింసలు పెట్టి చంపింది ఈ సమాజం. సత్యాన్ని ఈ లోకంలో ప్రతిపాదించడానికి వస్తే మహమ్మద్ ప్రవక్తను నిలకడగా ఉండనిచ్చిందా ఈ సమాజం? మక్కా నుంచి మదీనాకు పారిపోయేటట్లు చేసింది, ఎన్నో యుద్ధాలు చేయవలసి వచ్చింది. “హాక్ అనల్లక్” అంటే నేనే దేవున్ని అన్నటువంటి ‘షేమ్ స్టేబ్రిడ్జి’ ను ఏం చేసింది ఈ సమాజం? చిత్రహింసలు పెట్టి చంపింది.

అత్యంత పవిత్రుడైన జొరాస్ట్రియన్ ను ఏమి చేసింది? ఇంటిలోకి దూరి బయటకు లాగి చంపి వేసింది. నిస్వార్థ బుద్ధితో దేశానికి సేవ చేసిన మహాత్మా గాంధీ కి ఏమిచ్చింది ఈ సమాజం? గుండు పెట్టి కాల్చి చంపింది. అబ్రహాంలింకన్ను ఏమి చేసింది? నల్లవాళ్లు తెల్లవాళ్ళ మధ్య భేదం వద్దు అన్నందుకు ఆయనను చంపివేసింది ఈ సమాజం.

అయితే ఈ మహాత్ములందరిలో ఒక మంత్రం చూసామండి, ఎంత నిబ్బరం వాళ్లకు, సమాజం ఎన్ని ఇబ్బందులు పెట్టిన ఎన్ని నిష్ఠూరాలు చేసిన ,ఎన్ని అవమానాలు చేసినా, ఎన్ని అపనిందలు వేసిన, కిక్కురుమనకుండా శాంతంతో సహించినారు వీళ్ళు. వీళ్ల దగ్గర ఒక మంత్రం ఉండింది, ఏమది?

“సుఃఖమే దుఃఖమే మేరే భగవాన్ తేరే ఇచ్ఛా పూరత్ హో”

ప్రతి ఒక్క మహాత్మునిలో ప్రవక్తలలో ఈ మంత్రం నిండుకొని ఉంది. పరమాత్మా “నా ఇచ్ఛ నెరవేరకూడదు” అన్ని సందర్భాలలో “నీ ఇచ్ఛే నెరవేరాలి”. కీర్తి ప్రతిష్టలను ఇస్తున్నావు, నీ ఇచ్ఛే ఇది. ఈరోజు పూలహారం వేయవచ్చు రేపు చెప్పుల హారం వేయించవచ్చు, ఈరోజు చెప్పుల హారం వేసిన వాడు రేపు పూలహారం వేయవచ్చు. పరమాత్మ నీ ఇచ్ఛే నెరవేరుగాక. నేను నిమిత్తమాత్రుడిని, ఇది మహాత్ముల యొక్క మంత్రం. ఇది దివ్యమైనటువంటి మంత్రం. కనుక శిష్య భక్తాదులారా, మహాత్ముల యొక్క దివ్యమైన ఈ సహన మంత్రాన్ని అందరూ అలవరుచుకొని ఆధ్యాత్మిక మార్గంలో ముందడుగు వేయగలరని ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.